
ప్రజాశక్తి
మంగళవారం 29 జులై 2025
5
విజయనగరం



3న చదరంగం పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగస్టు మూడో తేదిన నగరంలోని గుంటూరు సుజాత కాలేజీలో జిల్లా స్థాయి అండర్ -19 బాలబాలికల చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్రీచెస్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు బి.అంకారావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -19 బాలురు, బాలికల నుంచి నలుగురు చొప్పున 8 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆగస్టు రెండో తేదిలోగా చదరంగం క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు 8520886564 సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం www.apchess.org వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోకుంటే పోటీలకు అర్హత ఉండదని స్పష్టంచేశారు. పోటీలకు డైరెక్టర్‌గా ఆర్.వి.తిరుపతి రావు వ్యవహరిస్తారని చెప్పారు.

ఎరువుల దుకాణాలపై విస్తృతంగా దాడులు

జిల్లాలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలపై అధికారులు దాడులను విస్తృతం చేశారు. ఇటీవల కాలంలో అందిన ఫిర్యాదుల మేరకు ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ ఆదేశాలతో ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. అందులో రికార్డులకు, ఎరువుల నిల్వలకు తేడాలుండటాన్ని గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ఎరువుల దుకాణాల్లో దాడులు చేపట్టి, తేడాలున్న చోట చర్యలకు ఉపక్రమించారు.



నెల్లిమర్ల: ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి -గజపతినగరం రూరల్

మండలంలో పలు ఎరువుల దుకాణాలను సోమవారం మండల ప్రత్యేక అధికారి రమేష్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో స్టాక్ నిల్వ, ఈపాస్ యంత్రాల్లో స్టాక్ సరిపోలడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ వాణి శైలజ, ఎడిఎ నిర్మల జ్యోతి, ఎఒ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : ఎరువులు, పురుగు మందులు అమ్మకాలలో ప్రతీ కొనుగోలు దారుకు బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి ప్రశాంత్ కుమార్ ఆదేశించారు. సోమవారం వివిధ ఎరువుల దుకాణాల్లో స్థానిక ఎఒ శివతో కలిసి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరుకులు నిల్వచేసే గోదాముల్లో నిల్వలు పరిశీలించి స్టాక్ రిజిస్టర్లో ఉన్న మొత్తాలకు గోదాం నిల్వకు సరిపోల్చి పరిశీలించారు. నిర్దేశిత ధర కన్నా అధిక ధరలకు అమ్మినట్లు రుజువైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా కూడా ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శరత్, డీలర్లు పాల్గొన్నారు.

డెంకాడ: డెంకాడ గ్రామంలో గల సాయికృష్ణ రైతు మిత్ర గ్రూపు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం షాపులను తహశీల్దార్ ఎం.రాజారావు, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు, ఎఒ టి.సంగీత పరిశీలించారు. తహశీల్దార్ రాజారావు మాట్లాడుతూ ఎరువులను భూమి ఉన్న రైతుకు ఒక్క రైతుకు ఒక బస్తా చొప్పున ఇవ్వాలన్నారు. రసాయన ఎరువులు నిల్వలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి పాల్గొన్నారు.

గంట్యాడ: మండలంలోని కొట్టారిబిల్లి జంక్షన్‌లో ఎరువులు దుకాణాలను సోమవారం మండల ప్రత్యేకాధికారి ఏ.దినకర్ తనిఖీ చేశారు. శ్రీ వెంకటేశ్వర జనరల్ స్టోర్. శ్రీబాలాజీ స్టోర్, మన గ్రోమోర్ సెంటర్ల యజమానులతో మాట్లాడుతూ ఆధార్ 1బి ప్రకారం ప్రతి రైతుకు ఒక యూరియా బస్తాను ఇవ్వాలన్నారు. యూరియాను నిలవచేయరాదని ఎప్పటికప్పుడే వస్తూ ఉంటాదని బ్లాక్ మార్కెట్‌కు తరలించినా అధిక ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఇ బి.శ్యామ్ కుమార్, ఎఇఒ స్వర్ణకుమార్ పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని తెర్లాం, సుందరాడ గ్రామాల్లోని ఎరువులు దుకాణాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీటి రామారావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు దుకాణాలు నిర్వహిస్తున్న లైసెన్సులు, బిల్లు బుక్కులు, సేల్స్ నిర్వహణ సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సక్రమంగా లేకపోవడంతో తెర్లాంలో జైశ్రీరామ ట్రేడర్స్ 10.3 టన్నులు, సుందరాడ సూరి చంద్ర ట్రేడర్స్ 8.5 టన్నుల మొత్తం 18.8 టన్నుల సీజ్ చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక మణికంఠ ఆగ్రో కెమికల్స్, శ్రీనివాస్ ట్రేడర్స్ ఎరువుల షాప్‌లను మండల ప్రత్యేకాధికారి మురళీ మోహన్, ఎడిఎ ఎన్.కోటేశ్వరరావు సోమవారం తనికీ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మురళీ, ఎడిఎ ఎన్. కోటేశ్వరరావు మాట్లాడుతూ డీలర్లు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు నాణ్యతతో కూడినవి ఇవ్వాలని సూచించారు. అధిక రేట్లకు అమ్మడం, బ్లాక్ చేయడం, వంటివి చేయరాదని కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు ఇవ్వాలని, స్టాక్ రికార్డులు నిర్వహించాలని, నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎఒ పి. శ్రీలక్ష్మి, ఎఇఒ ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: మండలంలోని ప్రైవేట్ ఎరువుల డీలర్ల షాప్‌లను మండల ప్రత్యేక అధికారి ఎ.షాల్మాన్ పరిశీలించారు. బొండపల్లి, రైతు సేవా కేంద్రం, పిఎసిఎస్, దేవుపల్లి ప్రైవేట్ ఎరువుల షాప్ లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయఅధికారి పివి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉణుకూరు శ్రీలక్ష్మీగణపతి ఎరువుల దుకాణాన్ని ఎఒ శ్రీనివాసరావు సోమవారం తనిఖీ చేసి మండిపడ్డారు. ఈ పోస్ మిషన్, స్టాక్ రిజిస్టర్ బిల్ బుక్స్‌ను పరిశీలించగా 6.2 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ఎరువుల అమ్మకాల్లో తేడాలు వస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అమ్మకాలకు సంబంధించి ఎరువుల రసీదు రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

6ఎ కేసులు నమోదు

విజయనగరం కోట: నగరంలోని మేదర వీధిలో ఉన్న మాతా వెంకటేశ్వర సన్స్ ఎరువుల దుకాణంపై 6ఎ కేసు నమోదు చేశారు. ఆదివారం వ్యవసాయ శాఖ చేపట్టిన తనిఖీల్లో యూరియా నిల్వలు అధికంగా ఉన్నట్లు గుర్తించి జరిమానా కూడా విధించారు. తెర్లాం మండలంలో కూడా రెండు 6ఎ కేసులు నమోదు చేశారు.

ఎరువులు అందించడంలో విఫలం

వంగర: మండలంలోని రైతులకు ఎరువులు అందించడంలో అధికారులు విఫలమయ్యారని ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. ఆయన స్థానిక మండల పరిషత్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు రైతులు ఎరువులు కోసం ఆందోళన చెందుతుంటే కనీసం యూరియా కూడా రైతులకు అందించలేని పరిస్థితుల్లో అధికారులున్నా రన్నారు. మండలంలోని వివిఆర్ పేట, శివ్వాం రైతు సేవా కేంద్రాలకు రెండు రోజుల క్రితం యూరియా వచ్చినప్పటికీ అవి రైతులకు సక్రమంగా అందించలేదని, ప్రైవేటు వ్యక్తులకు తాళాలు ఇవ్వటం వల్ల అర్హులైన రైతులు యూరియా అందక ఆందోళన చెందుతున్నారని అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు ఎరువులు పూర్తిస్థాయిలో అందించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.



ధర్నాలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, గిరిజనులు

కాకర్లవలస, కారేడువలస గిరిజనులకు
భూములను అప్పగించాల్సిందే

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని ● కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రామభద్రపురం మండలం కాకర్లవలస, కారేడువలస గ్రామాల్లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న గిరిజనుల భూములను తిరిగి అప్పగించి, వారికి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆ గ్రామాల గిరిజనులు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూములు తీసుకోవాలంటే ముందస్తు నోటీసులు జారీచేయాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభ ఆమోదం పొందాలని తెలిపారు. ఏ రకమైన ముందస్తు ఉత్తర్వులూ జారీ చేయకుండా, భూ సేకరణే చేపట్టకుండా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎంఎస్‌ఎంఇ పార్కు కోసం శంకుస్థాపన చేయడం అన్యాయమన్నారు. గతంలో ఎపిఐఐసికి ప్రభుత్వం తీసుకుంది కాబట్టి భూములను స్వాధీనం చేసుకున్నామని సాకులు చెప్పడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మూణ్నాలుగు దశాబ్దాలుగా గిరిజనులు భూములను సాగు చేస్తూ.. జీడి, మామిడి తోటలు, జొన్న పంటలు వేసి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం యంత్రాలను, వాహనాలను తెప్పించి జీడి, మామిడి చెట్లను దుర్మార్గంగా తొలగించడం.. సర్కారు దుర్మార్గ వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ఎంఎస్‌ఎంఇ పార్కు నిర్మించాలంటే సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం భూమిని గిరిజనులకు తిరిగి అప్పగించి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. లేకుంటే భవిష్యత్తులో అందరినీ కలుపుకొని ప్రజా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర ఇవ్వాలని ఆటో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్‌కి వాహన మిత్ర రూ.15 వేలు చొప్పున తక్షణమే చెల్లించాలని శ్రీకనకదుర్గ ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా కోకన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో, టాటా ఎసి మ్యాక్సీ క్యాబ్ వాహన డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ, కర్ణాటకలో అనుభవాలను పరిశీలించి ఇక్కడ నష్టపోతున్న డ్రైవర్లకు ప్రత్యామ్నాయని చూపాలని డిమాండ్ చేశారు. ఫీజులు, పెనాల్టీలు పెంచుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ 21ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బి.పాపారావు, జి.కూర్మారావు, రామారావు, భాస్కరరావు, ప్రసన్న, లక్ష్మణరావు, రాజు పాల్గొన్నారు.

ఉద్యోగాల కోసం డబ్బులిచ్చి మోసపోవద్దు

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య పనులు చేపట్టే ఉద్యోగాల కోసం డబ్బులిచ్చి మోసపోవద్దని కమిషనర్ పల్లి నల్లనయ్య ఒక ప్రకటనలో కోరారు. నగరంలో మెరుగైన పారిశుధ్య విధానం అమలు కోసం ఇటీవల కౌన్సిల్ అనుమతితో ఎస్‌సి పురుషులు 45 మందిని ఓ ప్రయివేటు కాంట్రాక్టర్ వద్ద పనిచేసేందుకు వీధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొందరు దీనికోసం రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇటువంటి మోసపూరిత చర్యలకు ఎవరూ బలి కావద్దని తెలిపారు. పారిశుధ్య పనుల కోసం కాంట్రాక్టర్ పనిలోకి తీసుకున్న వ్యక్తులు కేవలం తాత్కాలికమేనని గుర్తించాలని చెప్పారు. కార్పొరేషన్‌లో పనిగా ఏ ఒక్కరూ పరిగణించరాదని వెల్లడించారు. పారిశుధ్య పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరుక్షణం సదరు కాంట్రాక్టర్ పనిలో నుంచి తొలగించి వేస్తారని స్పష్టంచేశారు.

పిజిఆర్ఎస్‌కు 165 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు 165 వినతులు అందాయి. ఇన్‌ఛార్జి కలెక్టర్‌తోపాటు డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళీ, వెంకటేశ్వరరావు, ప్రమీలా గాంధీ ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 70 వినతులు అందాయి. పంచాయతీశాఖకు 9, పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 23 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 11, విద్యా శాఖకు 8, వైద్య శాఖకు 6 , విద్యుత్ శాఖకు వచ్చాయి.

అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాముఖ్యత

పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారుల వినతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. పిజిఆర్ఎస్‌లో వినతులు స్వీకరించిన అనంతరం అధికారులతో ఆయన మాట్లాడారు. అర్జీలు పునరావృతం కాకుండా పరిష్కరించాలని, అందులో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టంచేశారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.

పాఠశాల భవనం నిర్మించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెంటాడ మండలంలోని రెడ్డివానివలస గ్రామంలో పాఠశాలకు సొంత భవనం నిర్మించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆ గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ 1980లో కూలిపోయిన పాఠశాల భవనాన్ని ఇప్పటివరకూ ఏర్పాటు చేయలేదన్నారు. అద్దె భవనంలో ఉన్న ఆ పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారని వస్తున్నారని చెప్పారు. సొంత భవనం, మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాడు - నేడు కార్యక్రమంలో మంజూరైన నిధులను వేరే పాఠశాలకు మళ్లించి, ఈ పాఠశాల విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. నమ్మి ఓట్లు వేసిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రిని, గ్రామ సర్పంచ్‌ను కలిసినప్పటికీ ఎటువంటి మేలూ జరగలేదన్నారు. నాడు-నేడు పనులకు తీసుకొచ్చిన సిమెంట్ బస్తాల మధ్యలో పిల్లలు చదువుకోవడం వల్ల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే రెడ్డివానివలసలో పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, సహాయ కార్యదర్శి ఆర్.శిరీష, జిల్లా నాయకులు రాజు, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి

● ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్
● పెదతాడివాడ వద్ద సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే నాగమాధవి

ప్రజాశక్తి-డెంకాడ

ప్రస్తుతం ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అందుకోసం పెద్దఎత్తున మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. డెంకాడ మండలం పెదతాడివాడ వద్ద రూ.2.8 కోట్లతో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ విద్యుత్తు ఛార్జీలను పెంచకుండానే పెద్ద ఎత్తున మౌలిక వసతులను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే సుమారు 78 వేల విద్యుత్ కనెక్షన్లను మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఈ ఏడాదిలోనే జిల్లాలో ఇప్పటికే 6 సబ్ స్టేషన్లను ప్రారంభించామని, మరో 3 నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. పిఎం సూర్యఘర్ పథకంలో నియోజకవర్గానికి 10 వేలకు తక్కువ కాకుండా సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ నియోజకవర్గానికి కొత్తగా 5, తీరప్రాంతానికొక విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరామని చెప్పారు. తమ ప్రాంతంలో లోవోల్టేజీ సమస్యల వల్ల తరచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని, వీటిని నివారించేందుకు కొత్తగా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదించామని తెలిపారు.

ఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ మాట్లాడుతూ దాసన్నపేట, డెంకాడ సబ్‌స్టేషన్లపై ఒత్తిడి తగ్గించి, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టిల ఇళ్లకు సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎం.లక్ష్మణరావు, ఆర్‌డిఒ డి.కీర్తి, ఎంపిపి బి.వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో కార్మికుల వినతి

విద్యుత్తు సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని వారు.. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి వినతిపత్రం అందజేశారు. పిఆర్‌సి ఎరియర్స్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రతీ కార్మికుడికి రూ.40 వేలు జీతం ఇవ్వాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.కోటి బీమా కట్టాలని, అన్‌లిమిటెడ్ హెల్త్ కార్డులు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షల వరకు అందజేయాలని విజ్ఞప్తిచేశారు.

సహకార రంగంలోనే అభివృద్ధి

సహకార భారతి రాష్ట్ర అధ్యక్షులు అడ్డూరి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

సహకార రంగం అభివృద్ధి చెందితేనే సామాజికాభివృద్ధి, తద్వారా దేశాభివృద్ధి సాధ్యమని సహకార భారతి రాష్ట్ర అధ్యక్షులు అడ్డూరి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్అండ్‌బి కూడలి వద్దనున్న కలాం ఫౌండేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహకార భారతి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సహకార రంగాన్ని అభివృద్ధి చేయడం వల్లే ఆయా రాష్ట్రాలు రైతులకు, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించగలిగాయని తెలిపారు. దురదృష్టవశాత్తూ దక్షిణాది రాష్ట్రాల్లో సహకార రంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార భారతి ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో సహకార రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ జిల్లాల్లో కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర ఆరు జిల్లాలలో సమన్వయకర్తలు మమ్ముల తిరుపతిరావు, అమరా సర్వదేవుళ్ల ఆధ్వర్యంలో కమిటీలు వేశామన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు జానకీదేవి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుండి ప్రారంభించి, రాష్ట్ర వ్యాప్తంగా సహకార భారతిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముందుగా మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. అనంతరం సామాజిక సేవా రంగం నుండి రాజకీయ రంగంలోకి వచ్చి కెల్ల పిఎసిఎస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన కె.విమలారాణిని ఘనంగా సత్కరించారు. సహకార భారతి జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. సమావేశంలో చేనేత విభాగం రాష్ట్ర ప్రముఖ్ రామక్రిష్ణ, జిల్లా అధ్యక్షులు జాగరపు ఈశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మార్పిన అప్పలనాయుడు, సహ కార్యదర్శి త్యాడ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంసి నూతన చైర్మన్ కర్రోతు నర్సింగరావు

30న ఎఎంసి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 30న విజయనగరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు నూతన చైర్మన్ కర్రోతు నర్సింగరావు తెలిపారు. సోమవారం విజయనగరం ఎఎంసి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్లు నాగార్జున, గొంప క్రిష్ణ, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్విని, ఇతర ప్రముఖులు రానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ బొబ్బాది చంద్రునాయుడు, డైరెక్టర్లు వెలిచెట్టి మణికుమార్, షేక్ హుస్సేన్, ఎం.దేవిశ్రీ, సాది సాయిరాం, చందగా తాతయ్యలు, వర్రి సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 44 అర్జీలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్


జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి వకుల్ జిందాల్ ఆధ్వర్యాన నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 44 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఎస్‌పి.. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, చర్యలకు ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలపై 10, కుటుంబ కలహాలపై 4, మోసాలపై 4, ఇతర అంశాలకు సంబంధించినవి 26 అర్జీలు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి

ఎఐసిసి సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ

ప్రజాశక్తి-విజయనగరంకోట

సంస్థాగత ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని ఎఐసిసి సంయుక్త కార్యదర్శి డాక్టర్ పాలక్ వర్మ సూచించారు. సోమవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంస్థాగత ఎన్నికలకు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మన రాష్ట్ర నాయకత్వంపైనే ఆధారపడి లోక్‌సభ ఏర్పడేదని చెప్పారు. అదే స్థాయిలో మళ్లీ పార్టీని పునర్నిర్మించుకొని, అధికారంలో రావాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీలు కాంగ్రెస్ కార్యకర్తల మనోబలాన్ని దెబ్బతీయాలని చూస్తున్నాయని, మనలో ఎటువంటి లోపమూ లేకుండా పోరాటం చేస్తే విజయం వరిస్తుందని, మార్పు మన వైపు చూస్తుందని వ్యాఖ్యానించారు. బూత్ స్థాయిలో బిజెపి చేస్తున్న ఓట్ల తారుమారుపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎన్‌డిఎ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండటానికి కారణం రాష్ట్రంలోని కూటమి పార్టీలేనని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ టిడిపి కూటమి నేతలు ప్రత్యేక హోదాపై మాట్లాడకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలోనూ బిజెపితో పొత్తు పెట్టుకుని టిడిపి.. ప్రజల మనోభావాలతో ఆడుకుందన్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు మరిపి విద్యాసాగర్, పిసిసి కార్యదర్శులు అయ్యప్ప, మదన్మోహన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రామారావు, జిల్లా కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, హాసన్ షరీఫ్, కరీం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఐసిసి సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ



అధికారులతో మాట్లాడుతున్న నాగార్జున

సహకార బ్యాంకుల బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - చీపురుపల్లి

జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకుల బలోపేతానికి చర్యలు తీసుకుంటామని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. సోమవారం గరివిడి డిసిసిబి బ్రాంచిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, కార్పొరేట్ స్థాయి బ్యాంకులకు ధీటుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. డిపాజిట్లను మరింత పెంచడం ద్వారా రైతులకు వడ్డీ మొత్తాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. బ్రాంచ్‌లో వ్యాపార లావాదేవీలు పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ గొలగాన భారతి, బ్యాంకు స్టాఫ్ ఇందిర, సుమ, వందన తదితరులు పాల్గొన్నారు.

కళల ద్వారా బోధనపై శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ (డైట్)లో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో కళాకారులు, ప్రముఖ నటులు ఆదయ్య మాస్టారుచే ఛాత్రోపాధ్యాయులకు నటనకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏదైనా అంశాన్ని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెప్పడానికి కథలు, పాటలు, చిత్రలేఖనం, అభినయం, మూకాభినయం ఎలా ఉపయోగించవచ్చునో ఆదయ్య తను ప్రదర్శన ద్వారా ఛాత్రోపాధ్యాయులకు చూపించారు. ఆయన చూపిన మూకాభినయం ద్వారా విద్యార్థులు ఎంతో ప్రేరణ పొందారు. బోధన సమయంలో ఈ అంశాలు ఎంతో చక్కగా ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా ఆదయ్య మాస్టారుని ప్రిన్సిపాల్ డాక్టర్ కె .రామకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, స్టాఫ్ సెక్రటరీ వాక చిన్నం నాయుడు, లెక్చరర్లు గోపాలకృష్ణ, రమేష్, శ్రీనివాసరావు, కాళ్ల అప్పారావు మురళి, సోమయాజులు, శర్మ తదితరులు అభినందించారు.

ఉత్తరాంధ్రకు టిడిపితోనే న్యాయం

ప్రజాశక్తి- బొండపల్లి

ఉత్తరాంధ్రకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతోందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నడూ లేనివిధంగా విజయనగరం జిల్లాకు చెందిన పూసపాటి అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి ఇచ్చి ఉత్తరాంధ్ర ప్రజలను గౌరవించడమేనని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. విశాఖ రైల్వే జోన్, భోగాపురం విమానాశ్రయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆ దిశగా అభివృద్ధి చేస్తోందని చెప్పారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా రవికుమార్

ప్రజాశక్తి - వేపాడ



స్థానిక ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శిక్షణ నిమిత్తం సామర్లకోట వెళ్లడంతో ఆయన స్థానంలో ఇంఛార్జి ఎంపిడిఒగా రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన వచ్చేంత వరకూ ఎంపిడిఒగా తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - వేపాడ

గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేయాలని మండలంలోని సింగరాయి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలోని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ క్యాంపు కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బానాది నుంచి ఆతవ వరకూ రూ.4.50లక్షలు, సింగరాయి నుంచి ఆతవకు రూ.50లక్షలు, సింగరాయి నుంచి చందులూరుకు రూ.2.40 లక్షలు, కిర్తన్నపేటకు రూ.1.50 లక్షలు, ఆతవ నుండి భూమిరెడ్డి పాలెంకు రూ.2.40 లక్షలు, ఎఎస్‌పేట నుంచొ కొండగుళ్ళు వరకు రూ.1.50 లక్షలు ప్రతిపాదనలు పంపించారని నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. సోంపురం జంక్షన్ నుంచి ఆనందపురం జంక్షన్ వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు పనులు నిలిచిపోయిన విషయాన్ని కూడా ప్రస్తావించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ఉత్తమ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- వేపాడ

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి, వివిధ పోటీ పరీక్షల్లో సముచిత ర్యాంకులను కైవసం చేసుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఆకలి భూమిక డైట్ సెట్‌లో స్టేట్ లెవెల్ 132 ర్యాంకును సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు పొందినప్పటికీ, ఎపిఇఎపి సెట్ ద్వారా సాధించిన ర్యాంకు ఆధారంగా, ఆంధ్రా యూనివర్సిటీలో ఉచిత సీటును కైవసం చేసుకున్నందుకు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు, ఈ సందర్భంగా ఎపిఇఎపి సెట్‌లో 32వేల ర్యాంకు పొంది, ఇంజనీరింగ్ కోర్సులో అడ్మిషన్ పొందిన బి. సిద్ధార్థను, రమ్యశ్రీని, లతికలను కూడా ఆయన అభినందించారు.

నేరాలు ఘోరాలు

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చీపురుపల్లి

వ్యాను ఢీకొని కుప్పిలి శ్రీనివాసరావు (37) మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పుర్రాయవలస గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, నీలబాబు ఇద్దరూ చీపురుపల్లి నుండి పల్సర్ బైక్‌పై పుర్రాయవలస గ్రామానికి వెళుతుండగా స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న లగేజీ వ్యాన్ ఢీకొని కుప్పిలి శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న కుప్పిలి నీలిబాబుకి తీవ్రమైన గాయాలవడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు చీపురుపల్లి ఎస్ఐ ఎల్ దామోదర్ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండలంలోని చందులూరు గ్రామం ప్రధాన రహదారి దేవి గుడికి దగ్గరలో దారి పక్కన సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నవీన్ పడాల్ సిబ్బందితో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సిఐ అప్పలనాయుడు అక్కడికి చేరుకొని పరిశీలించారు. మృతుని ఒంటిపై గాయాలు ఉండడంతో ఇది హత్యగా పోలీసులు భావిస్తున్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఎస్ కోట ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించారు. మృతుని ఒంటిపై పూర్తి నలుపు, నీలం రంగు టీషర్ట్, లుంగీతో వున్నాడని వయసు 50 ఏళ్ళ లోపు ఉంటాయని సిఐ తెలిపారు.

ఇద్దరు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అప్పాపురం గ్రామ సమీపం మలుపు వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు విద్యార్థులు జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో పాలకొండ మండలం మంగళాపురం గ్రామానికి చెందిన మడపాలసాయి, సంతకవిటి మండలం మండవకురిటికి చెందిన కేతుబారికి యోగేష్‌లకు గాయపడ్డారు. కొమిరి వెంకటాపురం తన మిత్రుడిని చూసేందుకు వెళ్ళి తిరిగి ప్రయాణంలో అప్పాపురం గ్రామ సమీప మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా ఈఎంటి మీసాల ఈశ్వరరావు, గర్భాపు నారాయణ రావు హుటాహుటిన చేరుకొని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి పాలకొండ ప్రభుత్వాసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గంజాయి కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సిఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. వ్యాస నారాయణ మెట్ట సమీపంలో గంజాయి అమ్ముతుండగా చిల్ల రవితేజ, మచ్చ తేజ, జరజాపు గిరిచందు దుర్గా ప్రసాద్ గంజాయి అమ్ముతుండగా సోమవారం పట్టుకున్నట్లు తెలిపారు.

టిడిపితోనే అభివృద్ధి : మంత్రులు

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రులు గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోలిపల్లి గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనుకున్న ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. అనంతరం ఎపి మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో కలిసి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా హుదూద్ తుపాను సమయంలో ఇంటినిర్మాణాలు చేపట్టిన వారికి కరెంటు పోజిషన్ సర్టిఫికేట్లు ఇవ్వాలని మంత్రికి వినతి పత్రాన్ని అందించారు. గ్రామంలోని పైడితల్లమ్మ ఆలయంలోని దర్శనం అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు



పథకాలు గురించి వివరిస్తున్న మంత్రులు, మార్క్ఫెడ్ చైర్మన్

లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖనార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు నజీర్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, నాయకులు గేదెల రాజారావు, ఆకిరి ప్రసాద్‌రావు, భోగాపురం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్ కుమార్, మహంతి శంకర్రావు, పల్లె భాస్కరరావు, పతివాడ విద్యాసాగర్‌నాయుడు, క్లస్టర్ ఇంచార్జిలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని బల్లంకిలో ఎంపిటిసి గొంప తులసీ ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లి ధనుంజయ్, మాజీ సర్పంచ్ గొర్ల నాగరాజు, వార్డు మెంబర్ నాగళ్ళ సింహాచలంనాయుడు, గ్రామ టిడిపి కార్యదర్శి గొర్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పద్మ

ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలోని పాతబగ్గాంలో సర్పంచ్ పద్మ సోమవారం రాయితీపై రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రం వద్ద 276 యూరియా, 240 డిఎపి బస్తాలను 250 మంది రైతులుకు ఆధార్, వన్‌బి ఆధారంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ సునీత ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సర్పంచ్ పద్మ మాట్లాడుతూ రైతులకు రాయితీపై యూరియా రూ.270కు, డిఎపి రూ.1350కు పంపిణీ చేశామన్నారు. రైతులకు ఎరువులు కావలసి వస్తే ముందుగానే రైతు సేవా కేంద్రం వద్ద సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, నాయకులు చిన్నం నాయుడు, కర్రి సన్యాసిరావు, ఎస్.సత్యనారాయణ, ఎస్.సన్యాసిరావు, ఎస్.వెంకటరమణ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని పేరాపురం గ్రామంలో బ్యులా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మహిళల కోసం కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా బ్యులా మినిస్ట్రీస్ పాస్టర్ సామ్యూల్ రాజేష్ మాట్లాడుతూ మహిళల సాధికారతకు కుట్టు శిక్షణ ఒక మంచి సాధనం అన్నారు. ఇది వారి ఆర్థిక స్వావలంబనకు దోహదం చేస్తుందన్నారు. శిక్షణ పొందిన తర్వాత అనేకమంది తమకు తామే ఉపాధి పొందగలుగుతారన్నారు. శిక్షణాకాలంలో శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. గ్రామస్థులు, మహిళలు శిక్షణ ప్రారంభాన్ని ఆహ్లాదంగా స్వాగతించారు.

ప్రజలను మోసగించారు : వైసిపి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రజలను మోసగించి కూటమి ప్రభుత్వం గెలిచిందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. చంద్రబాబు ఎన్నికలు ముందు ఇచ్చిన మేనిఫెస్టో గుర్తుచేశారు. మానిఫెస్టోలో ఇచ్చిన పథకాలు ప్రజలకి ఈ ఏడాది రాకపోవటం వల్ల ఎంత నష్టపోయారో అని వివరించి కరపత్రాలు అందజేశారు.

డెంకాడ: కూటమి పాలనలో అభివృద్ధి లేదు సంక్షేమం లేదని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం మండలంలోని కౌలువాడ, ముంజేరు, రామచంద్రపేట, చేపల కంచేరు, నందిగాం, గుడివాడ, భోగాపురం గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, నెల్లిమర్ల జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నాయకులు వైకుంఠం, రావాడ సూర్యనారాయణ రాజు, రేగాన శ్రీనివాసరావు, సుందర



బొబ్బిలి: చంద్రబాబు మోసాలను వివరిస్తున్న శంబంగి

హరీష్ రావు, సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని కుంపల్లి, కృష్ణరాయుడుపేట గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి మండల అధ్యక్షులు మమ్ములూరి జగన్నాథం పాల్గొని చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సోంపురం సర్పంచ్ గంగరాజు, భోజంకి శ్రీను, ఆకుల సత్తిబాబు, కుంపల్లి సర్పంచ్ నౌడు శ్రీను, అరుణ, కృష్ణరాయుడుపేట సర్పంచ్ బాలబాబు, నిరుజోగి శ్రీను, కేదారి శ్రీను, సుంకర పైడ్రాజు, కోలా సంతోష్ తదితరులు పాల్గొన్నారు **బొండపల్లి:** మండలంలోని గరుడబిల్లి, వేంద్రాం, ఒంపల్లి గ్రామాలలో ఆదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం ఎంపిపి చల్ల చలంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొట్లాం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు మహంతి రమణ, పెంటమనాయుడు, చలంనాయుడు, పల్లి రఘు, సర్పంచులు కర్రోతు శ్రీనివాసరావు, లండ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు

బొబ్బిలి: పట్టణంలోని తొమ్మిదో వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, వైసిపి నాయకులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను వివరించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్, సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిది కాకుల గోల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీపురుపల్లి

అధికారం కోల్పోవడంతో గ్రామాల వారీగా పర్యటిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాకులు మాదిరిగా గోల చేస్తున్నారని, దీనికి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఇంటింటా పర్యటిస్తూ హంసల మాదిరిగా జరిపిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తుందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్ల పాలనలో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సంక్షోభంలోకి నెట్టి విధ్వంస పాలన అందించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. 1982లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అధికారం చేపట్టిన తర్వాత కూడు గూడు బట్ట ప్రతి పేదవానికి అందజేసి అందరి గుండెల్లో ఎలా నిలిచారో ప్రస్తుతం చంద్రబాబు నాయుడు పాలనలో గ్రామాల వారీగా ప్రజల కళ్ళలో అదే ఆనందం కనిపిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి తగిన ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అనకాపల్లి వద్ద గ్రీన్ ఎనర్జీ ఏర్పాటుతో పాటు పారిశ్రామికంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి రంగం సిద్ధం చేశారన్నారు. రాజకీయంగా కూడా ఎంతోమందికి ఉన్నత పదవులను అందజేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఉత్తరాంధ్ర నాయకులుగా గుర్తింపు పొందిన అశోక్ గజపతిరాజు లాంటి నాయకులకు గోవా గవర్నర్ పదవిని అందజేసి ఉత్తరాంధ్ర ప్రాంతానికి తగిన గుర్తింపుని ఇచ్చారన్నారు. కూటమి హామీలలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అన్నింటిలో ఒక్క పథకం మాత్రమే మిగిలిందని మిగిలినవన్నీ అమలు చేశామని స్పష్టం చేశారు. చీపురుపల్లి ఆర్ఇసిఎస్‌కు సంబంధించి సుప్రీం కోర్టులో వాజ్యం ఉన్నందున కొంత ఆటంకం ఏర్పడిందన్నారు. చంద్రబాబు నాయుడు సారధ్యంలో ఆర్ఈసిఎస్ హామీ త్వరలోనే పూర్తికానుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కె.త్రిమూర్తుల రాజు, టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామనాయుడు, ఆర్ఎస్ఎస్ మాజీ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌టి బాలికల వసతి గృహాల సమస్యలను పరిష్కరించి ప్రహరీని నిర్మించాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం 200 మందికి పైగా విద్యార్థులతో హాస్టల్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు మాట్లాడుతూ 2019లో ఈ బాలికల వసతి గృహం ప్రారంభించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు హాస్టల్లో ఉన్న సమస్యల గురించి వినతి పత్రాలు ఇస్తున్నాం కానీ ఎటువంటి మార్పులూ రావడం లేదన్నారు. 2023లో విద్యార్థినిలంతా కలిసి ధర్నా చేసి వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని కోరడంతో పనులు ప్రారంభించి మళ్లీ మధ్యలో నిలిపివేశారన్నారు. ప్రహరీ లేకపోవడంతో కొంత మంది వ్యక్తులు మద్యం సేవించి అక్కడ విద్యార్థినిలను ఇబ్బంది



మానవహారం చేస్తున్న విద్యార్థినులు

పెడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రహరీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. నెలలో సమస్యలు పరిష్కారానికి సమాధానం చెప్పని యెడల విద్యార్థినిలు అందరినీ ఐక్యం చేసి కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వి.భారతి, పి.రత్న, హాస్టల్ కమిటీ అనిత, శీలా, వసంత, మేఘన తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే.. కెరీర్ క్లోజ్!

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నూతన విద్యా సంవత్సరంలో అడిగిడుతున్న తరుణంలో సీనియర్లు నూతన విద్యార్థులకు స్నేహ పూర్వక వాతావరణం కల్పించాలని రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి పిలుపునిచ్చారు. ఒకవేళ ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వారి కెరీర్ ముగుస్తుందని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల సంభవించే అనర్థాల గురించి వివరించారు. ర్యాగింగ్ దాని వల్ల ఎదురయ్యే దుష్పరిణామాలపై అవగాహన లేకపోవడం వల్ల విద్యార్థులు తెలియకుండానే దాని వల్ల చాలా ఇబ్బందికరమైనా పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ర్యాగింగ్ చట్టంలో మీరు చేసిన దానిని బట్టి కనీసం ఆరు నెలల నుండి పది సంవత్సరాల వరకు జైలు శిక్ష వుంటుందన్నారు. ర్యాగింగ్ నేరంలో శిక్ష అనుభవించి బయటకు వచ్చిన తరువాత మీరు ఎక్కడా చదువు కోవడానికి వీలు లేని పరిస్థితులు

రిజిస్ట్రార్ డాక్టర్ పెదిరెడ్ల పల్లవి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ పల్లవి

ఏర్పడతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ అండ్ డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కూడా ర్యాగింగ్ చట్టాలను కఠినతరం చేసిందన్నారు. విద్యార్థులు చట్టాలను దృష్టిలో పెట్టుకొని మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే రెడ్ బుక్ తెరుస్తున్నారు

ప్రజాశక్తి- డెంకాడ

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై రెడ్ బుక్కు తెరిచి అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం మండలం ఉప్పాడపేట గ్రామంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు 400 రోజులు అయిందని ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదని వాటి గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై భయపెట్టి అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ఇచ్చిన ఒకటి రెండు పథకాల్లో పూర్తిగా అమలు చేయలేదని తల్లికి వందనం 25శాతం వరకే ఇచ్చారని అది కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి పోరాటం వల్లే జరిగిందని అన్నారు. హుదూద్ తుఫాన్‌లో పోలిపల్లి గ్రామంలో నిర్మించిన 156 మంది లబ్ధిదారులకు కరెంటు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత గ్యాస్, 50 సంవత్సరాలకే పెన్షన్ సూపర్ సిక్స్‌లో పథకాలే అని గుర్తుచేశారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ సూర్యనారాయణ రెడ్డి, నెల్లిమర్ల వైసిపి మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు సారిక వైకుంఠం, రావాడ సూర్యనారాయణ రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిందాల్ భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

శృంగవరపుకోట: జిందాల్ కంపెనీ కోసం భూములు కోల్పో యిన రైతులకు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే కడు బండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన జిందాల్ భూములు వల్ల నష్టపోయిన రైతుల గూర్చి మాట్లాడుతూ తక్షణమే నష్టపోయిన రైతులకి న్యాయం చేయాలని కోరారు. నిజంగా నష్టపోయిన రైతులు జాబితా సిద్ధం చేసి ప్రతిపక్షం తరుపున ప్రభుత్వంతో, జిందాల్ యాజమాన్యంతో పోరాటం చెయ్యడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, జెడ్‌పిటిపి మమ్ములూరు వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, సీనియర్ నాయకులు వాకాడ రాంబాబు, టౌన్ అధ్యక్షులు షేక్ రెహమాన్, పోతనపల్లి సర్పంచ్ వెంకట్రావు, నియోజకవర్గం యువజన అధ్యక్షుడు వాకాడ సతీష్, నాయకులు పడాల ధర్మారావు, దుర్గా ప్రసాద్, కడారి అప్పయ్య, జయశంకర్, సర్పంచ్ తగరంపూడి రమణ, వేములపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి - సంతకవిటి

నేర నిరోధక చర్యల్లో భాగంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే పల్లెనిద్ర చేసినట్లు సంతకవిటి ఎస్ఐ ఆర్. గోపాలరావు అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పొనుగుటివలసలో పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు కక్షలకు, గొడవలకు, దూరంగా ఉండాలనీ, మాదకద్రవ్యాలను కూడా దగ్గరికి చేరనివ్వకూడదని హితవు పలికారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఇరుక్కో వద్దని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి క్రయ విక్ర యాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై, గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే వినాయక చవితి ఉత్సవాల గూర్చి గ్రామస్తులకు వివరించారు.

గజపతినగరం రూరల్: పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గజపతినగరం ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు సోమవారం రాత్రి మండలంలోని పాత బగ్గాం గ్రామంలో పల్లెనిద్ర చేశారు.



సంతకవిటి: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ గోపాలరావు

కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సరదాగా మాట్లాడారు. వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిన్నంనాయుడు, మంత్రి సూర్యం, టిడిపి నాయకులు కర్రి సన్నాసిరావు, వైసిపి నాయకులు గురునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోపు పట్టాలు ఇప్పించాలి

ప్రజాశక్తి - మెంటాడ

గిరిజన, హరిజన నిరుపేద కుటుంబాల సాగులో ఉన్న పోడు, ఫారెస్టు భూములకు సంబంధించి రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఆగస్టు 15 లోపు ఇప్పించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా సాగులో ఉన్నప్పటికీ పలుమార్లు పట్టాలివ్వాలని అధికారులకు వినతులు సమర్పించినా ఫలితం శూన్యం అన్నారు. ఆంధ్ర రిజర్వాయర్ భూ నిర్వాసితులకు చేపల సొసైటీ ఏర్పాటు చేయాలన్నారు. గత 25 ఏళ్లుగా ఫారెస్ట్, ఇనాం భూములు, కొండ పోరంబోకు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులకు వినతలు అందజేశామన్నారు. గుర్ల మినీ రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ జిల్లా కార్యదర్శి తామరపల్లి సోములు,



అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గిరిజనులు

ఇ.సీతయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

మండల కేంద్రంలోని సంత తోట వద్ద సోమవారం కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్‌కు సంతాపం తెలిపారు. మొదటి ఆయన చిరతపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ అచ్యుతానందన్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కర్షక శ్రామిక కార్మిక సంఘాల కోసం ఎంతగానో ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు రెడ్డి రాజ అప్పలనాయుడు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తామరపల్లి సోములు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో శక్తి బృందాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో శక్తి టీమ్స్ ఏర్పాటు చేయాలని డిఎస్‌పి భవ్యరెడ్డి కోరారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో ఐదుగురు బాలికలతో శక్తి టీమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. బాలికలను వేధించిన, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేసిన పిఇటి ద్వారా పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. బాలికలు, మహిళలపై దాడులు, వేధింపులు నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే భవిష్యత్ అంధకారం

రేగిడి: విద్యార్థులు మత్తుకు బానిసైతే ఉజ్వల భవిష్యత్తు అంధకారమేనని ఎస్ఐ లీలావతి అన్నారు. ఉంగరాడ మెట్ట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో యాంటీ డ్రగ్స్, రోడ్డు సేఫ్టీపై సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి, నాటు సారా, ఇతర మత్తు పదార్థాలకు బానిసకారాదని వెల్లడించారు.

మీ భవిష్యత్తు మీ చేతిలో ఉందని విద్యార్థులకు హితబోద చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ ఉన్నారు.

నేడు ఎమ్‌పి జన్మదిన వేడుకలు

వేపాడ : మండల కేంద్రంలోని రావిచెట్టు దగ్గర మంగళవారం ఉదయం 9 గంటలకు ఎమ్‌పి శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'పి4'ను బహిష్కరిస్తాం : యుటిఎఫ్

బొబ్బిలి : పి4 కార్యక్రమం చేపట్టాలని ఉపాధ్యాయులపై బలవంతం చేస్తే బహిష్కరిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి తెలిపారు. యుటిఎఫ్ బొబ్బిలి డివిజన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. బోధనేతర పనులు పెట్టి ఊపిరితీయనీయకుండా చేస్తున్నారని, ఈ విధానాలు ప్రభుత్వ పాఠశాలలను బాగుచేయడానికా, నాశనం చేయడానికా? అని ప్రశ్నించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.